ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 27 జనవరి 2025

గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



స్వర్ణ అనంతకు 10

- అన్ని వర్గాల అభివృద్ధికి చర్యలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- విద్య, వైద్యం, సాగు, తాగునీటికి ప్రాధాన్యం
- తలసరి ఆదాయం రెట్టింపునకు ప్రణాళికలు
- అనంతను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి
- గణతంత్ర వేడుకల్లో కలెక్టరు వినోద్‌కుమార్





జాతీయ జెండాకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ వందనం



అగ్నిమాపక శాఖ ప్రదర్శన



వేడుకలలో గిరిజమ్మ, కాలవ, దగ్గుపాటి తదితరులు



పోలీసు జాగిలం విన్యాసం

అనంతపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాను స్వర్ణ అనంతగా తీర్చిదిద్దడానికి 10 సూత్రాలతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టరు వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరుతో పాటు ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ వేడుకలలో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు.

ఐదేళ్లలో రెట్టింపు తలసరి ఆదాయం

రాబోయే ఐదేళ్లలో జిల్లా తలసరి ఆదాయం రెట్టింపునకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టరు తెలిపారు. గణతంత్ర వేడుకల సభావేదిక నుంచి జిల్లా అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్రకోసం రాష్ట్ర ప్రభుత్వం 2047 డాక్యుమెంట్ ను ఆవిష్కరించిందని, అదే క్రమంలో జిల్లా అభివృద్ధికి ప్రత్యేక డాక్యుమెంట్ రూపొందించామన్నారు. స్వర్ణ అనంత సాధనకు చోదక శక్తులుగా ఉద్యాన పంటలు, లైవ్‌స్టాక్, రెన్యువబుల్ ఎనర్జీ, పరిశ్రమలు, పర్యాటక రంగాలను గుర్తించామన్నారు. ఉద్యాన పంటల కింద మామిడి, అరటి, చీనీ, టమోటా, మిరప పంటలను ప్రోత్సహి స్తామన్నారు. లైవ్‌స్టాక్ కింద గొర్రెల పెంపకం, పాలఉత్పత్తి, కోళ్ల పెంపకం, రెన్యువబుల్ ఎనర్జీ కింద సోలార్, విండ్‌ప్రాజెక్ట్, పరిశ్రల ఏర్పాటు, టూరిజం పార్క్‌లు ఏర్పాటు చేపడుతున్నట్లు వివరించారు.

అర్హులందరికీ పథకాలు

పేదరిక నిర్మూలనలో భాగంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి అందిస్తున్నా మన్నారు. జిల్లాలో ప్రతి నెలా 2.84లక్షల మందికి రూ.125కోట్ల పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళాసంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1194కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. బీసీ స్వయం ఉపాధి పథకం కింద బీసీ యువతకు 1728 యూనిట్లకుగాను రూ32.90కోట్లు, ఈబీసీ యువతకు 225యూనిట్లకు రూ.3.90కోట్లు3, కాపు యువతకు 344యూనిట్లకుగాను రూ.11.55కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో 6,67,308మందికి రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరకులు అందజేస్తున్నట్లు తెలిపారు. దీపం పథకం కింద 363592 మంది లబ్ధిదారులకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇళ్లు కట్టుకోవడానికి కేటాయిస్తామన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా జిల్లాలో 8 చోట్ల తక్కువ ధరకే నాణ్యమైన అన్నం, అల్పాహారం అందిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



విద్య, ఆరోగ్యానికి భరోసా

అభివృద్ధికి విద్య, ఆరోగ్యం అత్యంత కీలకమని, అందుకే ప్రభుత్వం ఈ రెండింటికీ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలో 1692 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పది వరకు 1,86,166 మంది చదువుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ కింద 3257 రోగాలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 6,20,604మంది వైద్య చికిత్స కోసం రూ. 208 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలలోను పిల్లల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందిస్తూ అనేక సేవలు అందిస్తున్నామన్నారు.



తాగు, సాగు నీటికి మరింత ప్రాధాన్యం

జిల్లాలో తాగు, సాగు నీటి కోసం మరింత ప్రాధాన్యం ఇస్తామని కలెక్టరు పేర్కొన్నారు. హంద్రీనీవా ద్వారా ఈసారి 40టీఎంసీలు కేటాయించగా 19.692 టీఎంసీలు వాడు కుని జిల్లాలో 34 చెరువులను నింపినట్లు తెలిపారు. బీటీపీ, ఇతర చెరువులు నింపడానికి అవసరమైన పనులు కొనసాగుతున్నాయన్నారు. నీటిప్రవాహం పెరగడానికి తొలిదశలో గుంతకల్లు మండలం కసాపురం నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రెండోదశలో శ్రీసత్యసాయి జిల్లా సరిహద్దు వరకు టెండర్ పిలిచి కాలువ లైనింగ్ పనులు చేపడతామన్నారు. తుంగభద్ర-హెచ్చెల్సీకి ఈఏడాది 29.434టీఎంసీలు కేటాయించగా లక్ష ఎకరాల ఆయకట్టుకు నీటిని అందజేశామన్నారు. మరో 10 టీఎంసీలను తాగు నీటి అవసరాలకు కేటాయించినట్లు వివరించారు. కాలువల ఆధునికీకరణకు తగిన నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.237కోట్లతో 745 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అమృత్‌పథకం కింద అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాలలో రూ.173కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. నగర పంచాయతీలలో తాగు నీటి సరఫరాకు రూ.650కోట్లతో పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

అన్నదాతలకు అండగా..

అన్నదాతలను ఆదుకోవడం కోసం రైతుసేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించామన్నారు. జిల్లాను హార్టికల్చర్‌హబ్‌గా మార్చాలని అరటి, మామిడి, టమోటా, చీనీ, మిరప పంటలను ప్రోత్సహిస్తు క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందశాతం డ్రిప్‌వాడుతున్న జిల్లాగా మార్చడానికి కార్యాచరణను రూపొందించామన్నారు. ఆయిల్‌పామ్ తోటల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువులలో చేపల పెంపకానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అరటిని విదేశాలకు సరఫరా చేయడం కోసం తాడిపత్రి నుంచి ముంబైకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పాడి రైతుల కోసం గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రూ.112కోట్లతో సిమెంట్‌రోడ్లు, తారురోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇలా జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులు, బాధ్యతలను అంకితభావంతో నెరవేర్చి అనంతను అన్నిరంగాల్లోను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టరు పిలుపునిచ్చారు.



భరత మాతకు బాలికల వందనం.. అలరించిన నృత్య ప్రదర్శన

నేను ఎమ్మెల్యే రైట్ హ్యాండ్‌ను..!



డంపును సీజ్ చేసినా ఇసుక తరలిస్తా
వీఆర్‌ఓకు ఎమ్మెల్యే అనుచరుడి బెదిరింపు
సోషల్ మీడియాలో కాల్ రికార్డు వైరల్

శింగనమల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'హలో..! నేను ఎమ్మెల్యే రైట్ హ్యాండ్‌ను. మీరు డంపును సీజ్ చేసినా ఇసుకను తరలిస్తా. ఎమ్మెల్యే చెప్పినా మీరు అడ్డుకుంటారా'? అంటూ గ్రామ రెవెన్యూ అధికారిని ఎమ్మెల్యే అనుచరుడు బెదిరించిన కాల్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మండలంలో 15 రోజులు కిందట రాచేపల్లి రెవెన్యూ పరిధిలోని ఇరువెందల వంక ప్రాంతం నుంచి నార్పల మండలం సిద్దరాచర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల నరసింహుడు ఇసుక తరలిస్తున్నాడు. అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను డంపు చేసి టిప్పర్లతో తరలించే వాడు. దీన్ని గుర్తించిన రెవెన్యూ, పోలీసులు ఇసుక డంపును సీజ్ చేశారు. అయినా నరసింహులు డంపు నుంచి దర్జాగా ఇసుకను తరలించాడు. దీనిపైన గ్రామ రెవెన్యూ అధికారి నాగేంద్ర ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు జరిమానా వేయడానికి నరసింహులుపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఆగ్రహం చెందిన నరసింహులు నాలుగు రోజుల కిందట రాచేపల్లి గ్రామ రెవెన్యూధికారి నాగేంద్రకు ఫోన్ చేశాడు. 'నేను ఎమ్మెల్యే రైట్ హ్యాండ్‌ను. మీకు ఎమ్మెల్యే చెప్పినా లేక్కలేదా? నేను డి.పట్టాలో ఇసుక కోనుగోలు చేశా. నా ఇసుకను అమ్ముకుంటా. మీరు డంపు సీజ్ చేసినా ఇసుక తరలిస్తా' అన్నాడు. దీంతో గ్రామ రెవెన్యూ అధికారి ఇసుక తరలించకూడదు కదా అనడంతో మరింతగా బెదిరించాడు. ఈ కాల్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇసుక తరలింపు బయటపడింది. నాలుగు రోజులు కిందట ఎమ్మెల్యే అనుచరుడు శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగగా, ఆయనపై తహసీల్దార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

హెచ్చెల్సీకి అదనపు జలాలు

ఫిబ్రవరి మొదటివారం వరకు సాగునీరు

బొమ్మనహాళ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువకు మరో టీఎంసీ నీటిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు అదనంగా ఓ టీఎంసీ నీటి మళ్లింపునకు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో వివరించారు. ఈ ఏడాది నీటి వాటా ఈ నెల 27వ తేదీ నాటికి ముగియనుండగా తాజా కేటాయింపుతో ఫిబ్రవరి మొదటివారం వరకు తుంగభద్ర ఎగువ కాలువకు నీరందనున్నట్లు తెలియజేశారు. ప్రధాన కాలువ ఆయకట్టు పరిధిలో సాగులో ఉన్న పంటలను కాపాడటంతో పాటు వేసవిలో తాగునీటి కోసం పీఏబీఆర్ కుడికాలువ పరిధిలో చెరువులకు నీరు ఇస్తామన్నారు. ముఖ్యంగా కణేకల్లు చెరువు కింద రెండో పంటసాగుకు నీరందనుందని తెలిపారు. ఆయకట్టు పరిధిలో సాగునీటి కొరత, పీఏబీఆర్ చెరువులకు నీటి సరఫరా అంశాన్ని ఫోను ద్వారా ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లినట్లు కాలవ పేర్కొన్నారు. ఈ ఏడాది హెచ్చెల్సీ వాటా కింద టీబీ బోర్డు 30.354 టీఎంసీలు కేటాయించిందన్నారు. దానికి తోడు కేసీ కెనాల్ వాటాలో తొలిదశలో రెండు టీఎంసీలు మళ్లించగా తాజాగా మరో టీఎంసీ మంజూరు చేస్తూ తుంగభద్ర బోర్డు కార్యదర్శికి మన ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. దీంతో ఈ ఏడాది ఎప్పుడూ లేనంత గరిష్ఠంగా 33.345 టీఎంసీ కేటాయింపులు దక్కినట్లైందని కాలవ వివరించారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..!

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమాలు

రేపు అనంత, కొత్తచెరువులో ప్రజలతో సమావేశాలు

అనంతపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చొరవ చూపుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజల మధ్య సమావేశం ఏర్పాటు చేయిస్తోంది. అనంతపురం నగరంలోని 32వ డివిజన్, శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు బీసీ కాలనీని మొదట ఎంచుకుంది. ఈ నెల 28న రెండు ప్రాంతాల్లోనూ సమావేశాలను నిర్వహిస్తోంది.

- అనంతపురం ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ స్కేటింగ్ మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు సమావేశం మొదలౌతుంది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, టూటౌన్ సీఐ, డివిజన్ కార్పొరేటర్, డివిజన్‌లోని ముఖ్య నాయకులు హాజరవుతారు.
- కొత్తచెరువు బీసీ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం మొదలవుతుంది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, తహసీల్దారు నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి నటరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు, పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రాధ తదితరులు పాల్గొంటారు.

మౌలిక వసతులే ప్రధాన సమస్య

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఎంచుకున్న రెండు ప్రాంతాలలో మౌలిక వసతులు ప్రధాన సమస్యగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చెత్త సేకరణ సరిగా జరడగం లేదు. విద్యుత్ కనెక్షన్లు, వీధి దీపాలు, తాగునీటి ఇబ్బందులు వంటివి ఉన్నాయి. వీటన్నింటిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలను ప్రచురిస్తోంది. సమావేశాలలో ప్రజలు పాల్గొని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి నేరుగా తీసుకువెళ్లేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' వేదికను ఏర్పాటు చేసింది.

జిల్లా కోర్టులో గణతంత్ర దినోత్సవం

అనంతపురం క్రైం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. హైకోర్టు పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి జెండా వందనం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, న్యాయాధికారులు సుబ్బారావు, శివశంకర్, ఉజ్జప్ప, సత్యవాణి, రాజేశ్వరి, హరిత, పావని, నిర్మల, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు జస్టిస్ శ్రీనివాసరెడ్డి వందనం

14వ బెటాలియన్‌లో...

బుక్కరాయసముద్రం మండలం జంతులూరు సమీపంలోని ఏపీఎస్పీ 14వ పోలీసు బెటాలియన్‌లో గణతంత్ర వేడుకులను నిర్వహించారు. కమాండెంట్ ప్రభుకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ విల్సన్ కేర్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్

నేటి నుంచి బాలికల హాకీ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో ఫాదర్ ఫెర్రర్ 13వ ఏపీ సబ్ జూనియర్ హాకీ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం నుంచి జరుగుతాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 17 జట్లు పాల్గొంటున్నాయని హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు.

- బాలికల సబ్ జూనియర్ హాకీ జిల్లా జట్టును ఎంపిక చేశామని అనీల్ కుమార్ తెలిపారు. సాయిభవ్య, భావన, మనోజ్ఞ, మల్లిక, సుమియ, మైథిలి, ఇందు, మిరాన్‌బీ, శృతి, భానుతేజ, శాలిని, వీరా అరుణ, అక్షయ, పూజిత, ప్రతిమ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. కోచ్‌గా దేవకి, మేనేజర్ అఖిల నియమితులయ్యారు.



ఎంపికైన జిల్లా సబ్‌జూనియర్ హాకీ బాలికల జట్టు

ప్రయాణం.. భారం!
అనుకూల సమయంలో ఉన్న రైళ్ల రద్దు
4

దాడుల కలకలం
ధర్మవరంలో రెచ్చిపోయిన జమీర్ వర్గం
4

బడిలో బోగస్ అడ్మిషన్లు

కమిషనర్ ఆదేశాలతో వివరాల సేకరణ

అనంతపురం విద్య, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్ మెంట్ గురించి ఉమ్మడి జిల్లాల్లో దర్యాప్తు జరుగుతోంది. ఈ నెల 24న జిల్లాకు వచ్చిన విద్యాశాఖ కమిషనర్, పాఠశాలల్లో బోగస్ రోల్ ఉందని వర్క్‌షాప్‌లో అన్నారు. యూ-డైస్‌లో విద్యార్థుల వివరాలకు, పాఠశాలల్లో విద్యార్థుల వివరాలకు తేడా ఉందని అన్నారు. బోగస్ రోల్‌ను ఎరివేయాలని సూచించారు. దీనిపై దర్యాప్తు చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. దీంతో కలెక్టర్లు కసరత్తు ప్రారంభించారు. తహసీల్దారు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, ఆర్డీఓలను క్షేత్రస్థాయికి పంపి, అడ్మిషన్ల వివరాలను సేకరిస్తున్నారు.

ప్రయాణం.. భారం..!

అనుకూల సమయంలో ఉన్న రైళ్ల రద్దు

ప్రయాణికులకు పెరిగిన చార్జీల ఖర్చు.. ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు



అనంతపురానికి కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్‌లో దివ్యాంగుల బోగీలోకి ఎక్కుతున్న అన్‌రిజర్వుడు జనరల్ టిక్కెట్టు ప్రయాణికులు

సమస్య ఇలా..
ప్రతిరోజూ అనంతపురం, ధర్మవరం వెళ్లడానికి అనుకూలమైన సమయంలో ఉదయం 6-40 గంటలకు కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు గుంతకల్లుకు వచ్చేది. ఈ రైలు ఉదయం ఎనిమిదిన్నరకు అనంతపురం, 9-15 గంటలకు ధర్మవరం చేరేది. అలాగే తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు ఉదయం 6 గంటలకు ధర్మవరంలో, ఉదయం 7 గంటలకు అనంతపురం వచ్చి గుంతకల్లుకు 9 గంటలకల్లా వచ్చేది. తిరిగి వెళ్లడానికి తిరుపతి-గుంతకల్లు రైలు ఉపయోగపడేది. ఈ రైళ్లకు ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు అనంతపురం, ధర్మవరం వెళ్లి తక్కువ చార్జీతో తిరిగి వచ్చేవారు. కానీ కుంభమేళా కారణంగా ఈ రైళ్లు రద్దుకావడంతో వారందరికీ సంకట పరిస్థితి ఏర్పడింది. ఈ రైళ్లే కాదు తిరుపతికి వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-తిరుపతి, గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు రైళ్లను కూడా రద్దు చేయడంతో పుణ్యక్షేత్రమైన తిరుమలకు వెళ్లడానికి తగిన రైళ్లులేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముంబై-చెన్నై వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల్లో ప్రయాణించడానికి స్థలం లేక తిరుపతి ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ రైలే లేదు

ఉదయం గుంతకల్లు నుంచి అనంతపురం వెళ్లే తిరుపతి ప్యాసింజరు రైలు రద్దు కావడంతో వేరే ఎక్స్‌ప్రెస్ రైలుకు వెళ్లే అవకాశాలు కూడా లేకుండాపోయాయి. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 9 గంటలదాకా మరో రైలు అందుబాటులో లేదు. గతంలో కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు 7 గంటలకు గుంతకల్లుకు చేరుకుని ఐదు నిమిషాలలో బయలుదేరి వెళ్లేది. కానీ రైళ్ల వేగాలు పెరిగిన తర్వాత ఈ రైలు ఉదయం 6 గంటలకు గుంతకల్లుకు చేరేలా సమయాన్ని సవరించారు. ఈ రైలుకు వెళ్లాలంటే అధికధరను చెల్లించడంతోపాటు కూర్చోవడానికి కూడా స్థలం దొరకని రద్దీ ఉంటుంది. పైగా ఉదయం 5 గంటలకు లేస్తే తప్ప ఈ రైలును అందుకోలేరు. ఈ రైలు కాక సోమవారం రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్, బుధ, శుక్రవారాలలో జైపూర్ ఎక్స్‌ప్రెస్, శనివారం ఓకా ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. జనరల్ కంపార్టుమెంట్లు అడుగు పెట్టడానికి కూడా స్థలం లేనంత రద్దీ ఉంటుండటంతో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్థానికుల ప్రయాణాలకు ఏమాత్రం అనువుగా ఉండవు.





తిరుపతి ప్యాసింజర్



గుంతకల్లు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా ప్రయాణించే రైళ్లు ఆగిపోవడం వేలాదిమందికి కష్టాలు తెచ్చిపెట్టింది. గుంతకల్లు నుంచి అనంతపురం, ధర్మవరం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, దినవారీ పనికి వెళ్లే కూలీల పరిస్థితి రైలు రద్దు కావడంతో తల్లకిందులైంది. ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ఇక్కడ తిరిగే తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి (నం.57405/06) ప్యాసింజరును, తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/03), తిరుపతి-హుబ్లీ-తిరుపతి (నం. 57401/02) ప్యాసింజరు రైళ్లను రద్దు చేశారు. గత నెల ఆఖరు నుంచి మార్చి 1వ తేదీ వరకూ ఈ ప్యాసింజరు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో అనంతపురం, తిరుపతికి వెళ్లి వచ్చేవారి సమస్య తీవ్రమైంది. తిరుపతి ప్యాసింజరుకు ప్రత్యామ్నాయంగా మరో రైలు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రం అయ్యాయి. తక్కువ డబ్బుతో ప్రయాణాలు చేసేవారికి నాలుగింతల చార్జీల భారం పడింది. రైలులో రూ. 40లు ఖర్చు అవుతుండగా బస్సుకు రూ. 300లు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు, ఉద్యోగులు, బడుగుజీవులు వాపోతున్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లే రైలు అందుబాటులో లేకుండాపోవడం ఇబ్బందికరంగా మారిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ రైలు అవసరమా?

అత్యంత ఆవశ్యకమైన గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరును రద్దుచేసిన డివిజనల్ అధికారులు పెద్దగా ప్రాధాన్యం లేని చిగ్జాజుర్-గుంతకల్లు-చిగ్జాజుర్ (నం. 57451/52) ప్యాసింజరు రైలును మాత్రం నడుపుతున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన ఈ రైలును ప్రాధాన్యం లేని బళ్లారి-చిగ్జాజుర్ మార్గంలో వేరే జోన్ పరిధిలోకి నడపాల్సిన అవసరం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రైలును కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య తాత్కాలికంగా నడిపినా డివిజన్ కేంద్రంలో, జిల్లా ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి ఈ రైలును జిల్లాలో నడపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

కుంభమేళాకు రైళ్ల మళ్లింపు విషయం ఉన్నతాధికారుల పరిధిలోనిది. వారు ఇచ్చిన ఆదేశాలను మాత్రమే మేము అమలు చేస్తున్నాం. రైళ్ల రద్దుతో స్థానిక ప్రయాణికులకు మాత్రం కొంత ఇబ్బందికరంగానే ఉంది. అయిన కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇక్కడి రైళ్లను అక్కడికి మళ్లించారు. మార్చి 1 నుంచి పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు.

- అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్, అనంతపురం

అనంతపురం వెళ్లాలంటే సమస్యగా ఉంది



జిల్లా కేంద్రానికి వెళ్లేవారికి తిరుపతి ప్యాసింజరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆ రైలు మూడు నెలలపాటు రద్దుచేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు వెయ్యి మంది ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. గుంతకల్లు-కల్లూరు మధ్యలో ఉన్న చిన్న స్టేషన్ల నుంచి కూడా ఎందరో ఎక్కి పనులకు అనంతపురం, ధర్మవరం వెళ్లేవారు. ఈ రైలును నిలిపివేయడం అందరికీ సమస్యగా మారింది.

-క్రిష్ణయ్య, గుంతకల్లు

అనంతపురం ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నారు



గుంతకల్లు, సమీప ప్రాంతాలకు చెందిన పేదలు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తిరుపతి ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. ఈ రైలు బందయ్యాక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు తక్కువ చార్జీతో జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం లేకుండాపోయింది. పేద ప్రజల సౌకర్యార్థం వెంటనే తిరుపతి ప్యాసింజరును పునరుద్ధరించాలి.

-మహమ్మద్ గౌస్, సీపీఐ నాయకుడు, గుంతకల్లు

తిరుపతికి వెళ్లడం కష్టంగా మారింది



ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తిరుపతికి వెళ్లే రైళ్లన్నింటినీ రద్దుచేశారు. ఎక్కడో జరుగుతున్న కుంభమేళా కోసం ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెట్టడం దారుణం. తిరుపతికి వెళ్లడానికి బస్సులు కూడా తగినన్ని లేవు. కనుక ఎంతో సమస్యగా మారింది. ప్యాసింజరును రద్దు చేయడం విద్యార్థులు, ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లేవారికి ఎంతో ఇబ్బందికరంగా మారింది. గతంలో నడిపిన గుంతకల్లు-ధర్మవరం ఫాస్ట్ ప్యాసింజరు రైలును పునరుద్ధరిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

-కే వెంకటేశ్వర్లు, అనంతపురం

చిగ్జాజుర్ ప్యాసింజరును ధర్మవరానికి నడపాలి



పెద్దగా ఉపయోగపడని గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరును మార్చి వరకూ కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య నడిపితే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చిగ్జాజుర్ ఈశాన్య రైల్వేలో ఉంది. మన జోన్‌కు, డివిజన్‌కు ఎటువంటి సంబంధంలేని చోటికి రైలును నడిపేబదులు జిల్లాలో నడిపితే మేలు.

- ఎం వెంకటేశులు, కాంట్రాక్టు లెక్చరర్, గుంతకల్లు

అయ్యో.. రైతన్న

విద్యుదాఘాతంతో మృతి

కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



గంగాధర్ (ఫైల్)

ధర్మవరంరూరల్, జనవరి26(ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించుకునే ప్రయత్నంలో రైతు మరణించాడు. పొలం చుట్టూ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో షాక్‌తో మరణించాడు. మండలంలోని మల్లాకాల్వ గ్రామానికి చెందిన రైతు సాకే గంగాధర్ (38) విద్యుదాఘాతంతో ఆదివారం మరణించాడు. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైతు తనకున్న మూడెకరాల పొలంలో బోరుబావి కింద వేరుశనగ సాగుచేశాడు. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని, పంట పెట్టాడు. ప్రస్తుతం పంట కాపు వచ్చింది. పొలం సమీపంలోని కొండగుట్టల నుంచి రాత్రివేళల్లో అడవి పందులు పంటపై దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఆ రైతు కుటుంబం రోజూ టపాకులు పేల్చుతుండేది. అయినా పంటపై పందులు దాడి చేస్తుండేవి. దీంతో రైతు గంగాధర్ పొలం చుట్టూ విద్యుత్ వైరు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి పొలానికెళ్లాడు. విద్యుత్ స్తంభంసమీపాన జీ వైర్‌తో పొలం చుట్టూ ఉన్న తంతికి కనెక్షన్ ఇచ్చాడు. జీ వైర్‌ను ప్రధానలైన్‌కు తగిలించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, అక్కడే కుప్పకూలాడు. ఒళ్లంతా కాలిపోయి మరణించాడు.



పొలంలో మృతదేహం

అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గంగాధర్ పొలంలో కిందపడి ఉన్న బ్యాటరీ లైటు వెలగడం చూసి దగ్గరకు వెళ్లి చూశారు. గ్రామస్థులు, కుటుంబీకులకు తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. రైతుకు భార్య ప్రభావతి, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు భార్య ప్రభావతి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. రోజూ పొలం వద్దకు తనను తీసుకెళ్లేవాడనీ, శనివారమే వద్దని చెప్పి వెళ్లాడంటూ రోదించింది.

ఖాద్రీశుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

కదిరి లీగల్/గాండ్లపెంట/నంబులపూలకుంట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆదివారం కదిరిలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జిల్లా పోర్టు పోలియో జడ్జి కూడా అయిన జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డికి ఆలయ తూర్పు రాజగోపురం వద్ద సహాయ కమిషనర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని న్యాయమూర్తి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. అనంతరం కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయించాలని న్యాయవాదులు.. న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు. న్యాయమూర్తి వెంట స్థానిక న్యాయాధికారి జయలక్ష్మి, డీఎల్ఎస్‌ఏ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలో వెలసిన యోగివేమన ఆలయాన్ని హైకోర్టు జడ్జి సందర్శించారు. నంబులపూలకుంట మండలంలోని గూటిబైలు గ్రామ సమీపంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును న్యాయమూర్తి సందర్శించారు. ఆలయంలో తిమ్మమాంబ, బాలవీరయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.



జస్టిస్ శ్రీనివాస్ రెడ్డికి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

దాడుల కలకలం

ధర్మవరంలో రెచ్చిపోయిన జమీర్ వర్గం

టీడీపీ వర్గీయుల వాహనాలపై రాళ్లు
కిందకు దిగిన వారిపై కర్రలతో దాడి
ఆరుగురికి గాయాలు



ధ్వంసమైన టీడీపీ నాయకుల వాహనాలు

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ నాయకులపై దాడి ఆదివారం కలకలం రేపింది. వైసీపీ నుంచి బీజేపీలోకి చేరనున్న జమీర్ అహమ్మద్‌తోపాటు ఆయన వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఆరుగురికి గాయాలు కాగా.. రెండు వాహనాలు, మరో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. పట్టణంలోని పదో వార్డులో పల్లవి థియేటర్ సమీపాన అటుగా వెళ్తున్న టీడీపీ నాయకుల వాహనాలపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. వాహనాలు దిగిన వారిపై కర్రలతో దాడులకు తెగబడ్డారు. దీంతో టీడీపీకి చెందిన షాహీర్, జావీద్, భానుప్రకాశ్, 12 ఏళ్ల చిన్నారి ఉబేష్, చిన్నారు లోకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మాన్ స్వల్పంగా గాయపడ్డాడు. దాడులతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

వాహనాలపై రాళ్లు

ధర్మవరంలోని పదో వార్డుకు చెందిన క్రిష్టాపురం జమీర్ అహమ్మద్ వైసీపీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. అదే వార్డుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు వాహనాల్లో ఆదివారం మధ్యాహ్నం అటు వైపుగా వెళ్తున్నారు. వాటిపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ నాయకులు వాహనాలు దిగి, ఎందుకు రాళ్లు వేస్తున్నారని ప్రశ్నించారు. వారు మరింత రెచ్చిపోయారు. ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో వాహనాలను ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. తమను చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారన్నారు. ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డామని వారు తెలిపారు. అక్కడి నుంచి పోలీసుల సాయంతో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే టీడీపీ శ్రేణులు భారీగా చేరుకుని, అండగా నిలిచారు. అనంతరం గాయపడిన వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించి, బందోబస్తు మధ్య చికిత్సలు నిర్వహించారు.

వైసీపీ హయాంలోనూ..

గత వైసీపీ హయాంలోనూ జమీర్ వైసీపీలోకి చేరి తమపై దాడి చేసినట్లు టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. జమీర్ వర్గీయులు సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాది ముందే టీడీపీని వీడి, ఆ పార్టీలో చేరారు. వైసీపీలోకి చేరిన నెల వ్యవధిలోనే టీడీపీకి చెందిన ముగ్గురు ముస్లింలపై విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పట్లో కేసు కూడా నమోదు చేయలేదని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేసిన క్రిష్టాపురం జమీర్ బీజేపీలో చేరేందుకు సిద్ధమవడాన్ని టీడీపీ వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేయడమేకాకుండా భౌతిక దాడులకు పాల్పడిన జమీర్, ఆయన కుటుంబసభ్యులను కూటమిలోని బీజేపీలోకి ఎలా చేర్చుకుంటారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ వినతిని ఖాతరు చేయటంటూ టీడీపీ వర్గీయులు రగలిపోతున్నారు.



టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్న వైసీపీ వర్గీయులు

భారీ బందోబస్తు

టీడీపీ వర్గీయులపై దాడులు పట్టణంలో కలకలం రేపాయి. టీడీపీ వర్గీయులు వేలాది మందిగా తిరుగుబాటుకు రంగం సిద్ధం చేశారు. పరిస్థితిని పసిగట్టిన డీఎస్పీ హేమంత్‌కుమార్ ప్రత్యేక బలగాలను మోహరించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చిస్తూ పరిస్థితిని గాడిన పెట్టడంలో సఫలీకృతులయ్యారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్, ఆస్పత్రి వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడి విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఎల్ నరేంద్రచౌదరి, పరిశే సుధాకర్, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవ రెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకున్నారు.



దాడిలో గాయపడిన లోకేశ్, షామీర్, జావీద్, భానుప్రకాశ్

శోభాయమానంగా శాంతి సద్భావన యాత్ర

అనంతపురం కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ 286వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి చేపట్టిన శాంతి సద్భావనయాత్ర శోభాయమానంగా సాగింది. అంతకుముందు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్ మాట్లాడారు. గిరిజనులకేకాక అన్ని సామాజిక వర్గాలవారికి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం శాంతి సద్భావన యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర పురవీధులగుండా సాగింది. బంజారాల సంప్రదాయం ఉట్టిపడేలా వేషధారణలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శేఖర్ బాబు, ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ నాయక్, చక్రే నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న భక్తులు.. రథంలో ప్రత్యేక అలంకరణలో సంత్ సేవాలాల్ మహరాజ్

హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు

గణతంత్ర దినోత్సవాన పస్తులు

సీకే పల్లి బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్



బీసీ హాస్టల్లో మధ్యాహ్న భోజనం అందక ఆకలితో ఉన్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీకే పల్లి బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్న భోజనం అందలేదు. మోడల్ స్కూల్, ఉన్నతపాఠశాలకు చెందిన 3 నుంచి పదో తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. గణతంత్ర వేడుకలకు ఉదయం వెళ్లి.. మధ్యాహ్నం 12 గంటలకు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ వంటగదికి తాళం వేసి ఉండటంతో చాలాసేపు వేచి చూశారు. డబ్బులున్న కొందరు హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. మరికొందరు పార్సిల్ తెచ్చుకుని తిన్నారు. డబ్బులు లేనివారు ఆకలితో అలమటించారు. వార్డెన్ నారాయణ స్వామి నింపాదిగా సాయంత్రం 4 గంటలకు హాస్టల్‌కు వచ్చారు. తమకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బడిలో పెట్టలేదా అని ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దారు సురేశ్ కుమార్ హాస్టల్‌కు వెళ్లి విచారించారు. వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ వ్యవహార్శైలి బాగా లేదని, మద్యం తాగి వస్తుంటారని స్థానికులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వార్డెన్ మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తోందని అన్నారు. దీంతో విషయాన్ని ఆర్డీఓ కలెక్టర్ టీఎస్ చేతన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వార్డెన్ నారాయణస్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి తెలిపారు.

మంత్రి సవిత ఆగ్రహం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నుంచి కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదని అన్నారు. వార్డెన్‌పై చర్యలకు ఆదేశించారు. విచారించి, నివేదిక ఇవ్వాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ధర్మవరం ఆర్డీఓ మహేశ్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.

అనంతపురం





జేడీఏ ఉమామహేశ్వరమ్మ



ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

సేవకు ఉత్తమ పురస్కారం

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ అధికారులుగా, ప్రైవేట్ వ్యక్తులుగా ఉత్తమ సేవలు అందించిన వారికి రిపబ్లిక్‌డే సందర్భంగా ఆదివారం పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతపురం జిల్లాలో 290 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 561 మంది పురస్కారాలు అందుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

శ్రీ సత్యసాయి



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు



పరపాటి సువర్ణ ఆర్డీఓ, పుట్టపర్తి



నరసింహారావు ఉద్యానశాఖ; డ్వామా పీడీ సలీం బాషా; శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్; శ్రీదేవి, సీడీపీఓ ఉరవకొండ; కేశవనాయుడు, ఆర్డీఓ; ఆనంద్, కలెక్టర్ డీపీఎం; వాణిశ్రీ తహసీల్దార్; రామప్ప, జూనియర్ అసిస్టెంట్

అహమ్మద్ అలీ, జూనియర్ అసిస్టెంట్; వీరనాగప్ప, కలెక్టర్ పీఎస్ఓ; భవాని విలేజ్ సర్వేయర్; అనిల్‌కుమార్, టీఏ; భూషణం, డీఏఓ వజ్రకరూరు; ప్రొఫెసర్ సతీష్ మెడికల్ కాలేజ్; డీవీ రమణ మూర్తి, ఏఎస్పీ; ఇలియాజ్ బాషా ఏఎస్పీ

శ్రీనివాసరావు అనంత డీఎస్పీ; శ్రీనివాసులు గుంతకల్లు డీఎస్పీ; రవిబాబు కళ్యాణదుర్గం డీఎస్పీ; నీలకంఠారెడ్డి ఏఆర్ డీఎస్పీ; ధరణి కిశోర్ సీఐ; శేఖర్, సీఐ; నీలకంఠేశ్వర, సీఐ; క్రాంతికుమార్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్

హరినాథ్, సీఐ; వెంకటేష్ నాయక్, సీఐ; విజయభాస్కర్ రాజు, ఎస్ఐ; టీపీ వెంకటస్వామి, ఎస్ఐ; జాఫర్, ఆర్ఎస్ఐ; వరుణాచారి, ఏఎస్ఐ; పద్మ కానిస్టేబుల్; ఆంజనేయప్రసాద్, ఎస్పీ సీసీ

రాకేష్, జూనియర్ అసిస్టెంట్; ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్; శ్రీవిద్య, డాక్టర్; అన్నపూర్ణ, ఎక్సైజ్ సీఐ; వేణుగోపాల్, బీసీ వెల్ఫేర్; సతీష్, బీసీ వార్డెన్; శారద, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్; సునీత, ఎంవీఐ; రవి, హౌసింగ్ వాచ్‌మన్

షబ్రీన్, కార్మికశాఖ; భాస్కర్ నాయుడు, పీసీ; పక్కీరయ్య, మత్స్యశాఖ; సురేఖరాణి, ఏడీసీసీబీ; రజియాబేగం, మహిళా సమాఖ్య; హరిప్రసాద్, అవార్డు గ్రహీత; రమేష్‌నారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్; అక్బర్ సాహెబ్, నేత్ర వైద్యుడు; సుదర్శన్‌రావు, జేఎన్‌టీయూ వీసీ

రమణారెడ్డి, సంజీవని; అలంబన జనార్దన్; ప్రమీలమ్మ, ఏజీఎస్; లెనిన్‌బాబు, సమాజసేవ; సాయి, సమాజసేవ; యుగంధర్ రెడ్డి, క్రికెటర్; నాగరాజు కానిస్టేబుల్; డాక్టర్ మమత జేఎన్‌టీయూ



విజయ్‌కుమార్ డీఎస్పీ పుట్టపర్తి; బాలసుబ్రహ్మణ్యంరెడ్డి స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ; ప్రదీప్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ; టి ఆనందకుమార్ ఆర్డీఓ, పెనుకొండ; వీవీఎస్ శర్మ ఆర్డీఓ, కదిరి; విజయ్‌కుమార్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్; వైవీ సుబ్బారావు వ్యవసాయ అధికారి; చంద్రశేఖర్, ఉద్యాన అధికారి

సుదర్శన్, మైక్రో ఇరిగేషన్ అధికారి; పద్మమ్మ, జాయింట్ డైరెక్టర్ సెరికల్చర్; శుభదాసు, పశుసం వర్ధక శాఖాధికారి; చంద్రశేఖర్‌రెడ్డి మత్స్యశాఖాధికారి; టీ.చక్రపాణి, జిల్లా అటవీశాఖాధికారి; మల్లికార్జునరావు భూగర్భజలవనరుల శాఖాధికారి; నరసింహమూర్తి మార్కెటింగ్ అధికారి; వంశీకృష్ణారెడ్డి, జిల్లా సివిల్‌సప్లై అధికారి

అశ్వర్థనారాయణ నాయక్ మేనేజర్; డాక్టర్ తిప్పేంద్రనాయక్ జిల్లా కోఆర్డినేటర్; శ్రీదేవి జిల్లా కోఆర్డినేటర్ ఎన్టీఆర్ వైద్యసేవ; కే నరసయ్య డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్; విజయేంద్రప్రసాద్ డ్వామాపీడీ; హరికృష్ణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి; శివరంగప్రసాద్ సాంఘికసంక్షేమ అధికారి; మోహన్‌రాం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి

నిర్మలాజ్యోతి బీసీ సంక్షేమశాఖ; కృష్ణప్ప విద్యాశాఖాధికారి; మురళీ మోహన్ పీఆర్ ఇంజనీర్; మల్లికార్జునప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి; సురేంద్ర, ఎస్ఈ ఏపీఎస్పీడీసీఎల్; వై. సమత జిల్లా పంచాయతీ అధికారి; వెంకటనారాయణ గృహనిర్మాణశాఖ; విజయశాంతిబాయి సర్వే ల్యాండ్ రికార్డ్స్

వేలాయుధం డీపీఆర్ఓ; టి హేమంతరెడ్డి అగ్నిమాపకశాఖ; సుధాకర్‌రెడ్డి నోడల్ అధికారి జీఎస్‌డబ్ల్యుఎస్; నరసింహమూర్తి పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్; కృష్ణానాయక్ కోఆపరేటివ్ అధికారి; నాగరాజు, పరిశ్రమల శాఖ; శ్రీనివాసులు కమిషనర్ హిందూపురం; కిరణ్ కుమార్ మున్సిపల్ అధికారి, కదిరి

రామకృష్ణ జిల్లా చేనేత టెక్స్‌టైల్స్ అధికారి; డాక్టర్ పీఎస్ మంజువాణి డిప్యూటీ డీఎంహెచ్ఓ; జయమ్మ ల్యాబ్ టెక్నీషియన్ ధర్మవరం; సాయిమనోహర్ ధర్మవరం ఎంపీడీఓ; శ్రీనివాసులు ఏడీ బత్తలపల్లి; రామాంజనేయులు ఎస్టీ హెడ్ కానిస్టేబుల్ రామగిరి; లక్ష్మీనారాయణ, పీఆర్, డీఈ



ఆంధ్రజ్యోతి అనంతపురం కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాప్తాడు సర్పంచ్ తిరుపాలు



నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం కొనసాగుతుందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరవుతారని, సమస్యలున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



జాతీయ జెండా ఆవిష్కరణకు హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

తొలిసారి ఏడీసీసీబీ శకటం



ఏడీసీసీ బ్యాంకులో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పర్సన్ ఇంచార్జి జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ



ఏడీసీసీ బ్యాంకు శకటం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చరిత్రలో తొలిసారి గణతంత్ర దినోత్సవాలలో శకటాన్ని ప్రదర్శించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా సీఈఓ సురేఖరాణి అవార్డు అందుకున్నారు. ఎన్టీఆర్ సహకార భవన్‌లో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ శివనారాయణ శర్మ జాతీయ జెండాను ఎగురవేశారు.

త్యాగధనుల ప్రతిఫలం గణతంత్రం: సీఎఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది త్యాగధనుల ప్రతి ఫలం ఈ గణతంత్రం అని సీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి పేర్కొ న్నారు. స్థానిక అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకల్లో సీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం గురించి వివరించారు.

అద్భుత ప్రదర్శనలు

పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవాలలో వివిధ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. దిశ పోలీసు విభాగం, అగ్నిమాపక శాఖ శకటాలను ప్రదర్శించాయి. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు తమ పరిధిలోని పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించాయి. విద్య, విద్యుత్ శాఖ, డ్వామా, అటవీ, ఏడీసీసీబీ, నగర పాలక సంస్థ, అహుడా, రెడ్‌క్రాస్ శకటాలు ఆకట్టుకున్నాయి. పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు విద్యార్థులు, కురుగుంట, కూడేరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థులు పామిడి వీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అనంతపురం విశ్వభారతి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ప్రథమ బహుమతి, నగరపాలక సంస్థ శకటానికి ద్వితీయ బహుమతి, ఏడీసీసీబీ శకటానికి తృతీయ బహుమతి లభించాయి. స్టాల్స్‌లో హార్టికల్చర్ శాఖ మొదటి బహుమతి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ రెండో, మూడో బహుమతి అందుకున్నాయి. మార్చ్‌ఫాస్ట్‌లో ఆర్ఎస్ఐ జాఫర్ బృందం మొదటి బహుమతి, ఉమెన్ కంటింజెంట్ ఎస్ భారతి బృందం ద్వితీయ బహుమతి, అగ్నిమాపకశాఖ బృందం తృతీయ బహుమతి అందుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



మొదటి బహుమతి అందుకున్న వైద్యఆరోగ్య శాఖ శకటం

290 మందికి ఉత్తమ అవార్డులు

అట్టహాసంగా పురస్కారాల ప్రదానం

అనంతపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించి, అభినందించారు. జిల్లా ఉన్నతాధికారుల కేటగిరిలో ఏడుగురికి ఉత్తమ అవార్డులను అందజేశారు. వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు 257మందికి ఉత్తమ అవార్డులు అందజేశారు. ప్రైవేటు రంగంలో సామాజిక సేవలను గుర్తించి 26మందికి కలెక్టర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ రాయదుర్గం కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, నగరమేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, నగరప్రజలు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఎస్పీ కానిస్టేబుల్ ఎస్ ధనుంజయ

అవార్డుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు

ఉత్తమ అవార్డు ఎంపిక జాబితాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో చేంతాడంత జాబితాను ప్రకటించేవారు. ఈసారి జాబితాను కుదించడం పట్ల హర్షం వ్యక్తం అయ్యింది. ఎంపికైన కొందరి విషయంలో అధికారులు తప్పు చేశారేమోనన్న భావనలు వ్యక్తమయ్యాయి. డ్వామా, డీఆర్‌డీఏ, వైద్య, రెవెన్యూశాఖలలో అవినీతి, అక్రమాలు మూటగట్టుకుని, శాఖాపరమైన చర్యలు తీసుకున్నవారికి అవార్డుల జాబితాలో అవకాశం కల్పించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డ్యూటీకే రాని మహిళా డాక్టరుకు అవార్డుల జాబితాలో చోటు కల్పించడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వచ్ఛంద సేవా రంగాలలో 26మందికి ప్రైవేట్ ప్రతినిధులకు అవార్డులు ప్రకటించగా అందులో ఒకసంస్థకు చెందిన మహిళకే రెండుసార్లు అవార్డుల జాబితాలో పేర్లు ప్రకటించారు. రాజకీయపార్టీలలో ఉంటూ విమర్శలు ఉన్నవారికి అవార్డులు ఇవ్వడంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



పురస్కారం అందుకుంటున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర

ఆకట్టుకున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టరు

గణతంత్ర దినోత్సవంలో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న ఆకట్టుకున్నారు. జేసీ రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆయన ఆ రాష్ట్ర సంప్రదాయం ప్రకారం తలకు పాగా పెట్టుకొని వేడుకలకు హాజరుకావడం అందరినీ ఆకట్టుకుంది. మనరాష్ట్రానికి చెందిన బొల్లినేని వినూత్న పదహారణాల తెలుగమ్మాయిలా చీరకట్టుకొని వేడుకల నిర్వహణను పర్యవేక్షించడం ఆకట్టుకుంది.

న్యూస్ బాక్స్

పశువుల సంత ఆదాయం రూ.4.68 లక్షలు

అనంతపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంతతో రూ. 4,68,770 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,51,110, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 2,17,660 వచ్చిందని ఆయన తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటిసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఆదివారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామివారికి అభిషే కాలు, ఆలంక రణ, అర్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

'పది' విద్యార్థులకు అట్టల పంపిణీ

నార్పల, జనవ26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలకు కుర్చీలు, పదో తరగతి విద్యా ర్థులకు అట్టలు పంపిణీ చేశారు. అలాగే నార్పల సత్యసాయి అనాథ ఆశ్రమం పిల్లలకు అట్టలు పంపిణీ చేశారు. పాఠశాలల హెచ్ఎంలు రవికుమార్, నాగేష్, పూర్వవిద్యార్థులు కలవాయి విశ్వనాథరెడ్డి, మదర్‌వలి, జయ నారాయణస్వామి, రాఘవేంద్ర, రామ తులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మసూద్ గాజీ స్వామి ఉరుసు

శింగనమల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన శింగనమలలో హజ్రత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజీ స్వామి ఉరు సు ఉత్సవాన్ని సోమవా రం నుంచి మూడు రోజు లు నిర్వహి స్తున్నట్లు దర్గా ముజావర్ ముల్లా అబ్దుల్ ఖదీర్ తెలిపారు. సోమవారం రాత్రి ఫకీర్ల జల్లాలతో గంధం ఊరేగింపు ఉంటుందన్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా పెద్ద ఎత్తున అన్న దానం చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరవుకానున్నట్లు తెలిపారు. రాత్రి ఖవ్వాలీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 29న బుధవారం జియారత్ కార్యక్రమంలో దర్గాలో అన్నదానం చేపట్టి రాత్రికి పాటల కచేరీ నిర్వహిస్తారని అబ్దుల్ ఖదీర్ తెలిపారు. ఉరుసు సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తెలుగుయవత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు దండు శ్రీనివాసులు రూ.15 వేలు విరాళాన్ని ముజావర్లకు అందజేశారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

ఆత్మకూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. సిద్దరాంపురం గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుల కు టుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన నాలుగో వార్డు సభ్యుడు రమేష్, ఐదో వార్డు సభ్యుడు నరసింహులుపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. దాడిలో గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చిన్నారిపై గంజి... ఆలస్యంగా వెలుగులోకి..

అనంతపురం క్రైం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాణినగర్‌లో ఓ చిన్నారిపై వేడి గంజి పడి తీవ్రగాయాలయ్యాయి. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాణినగర్‌కు చెందిన ముసీనాబేగం తన ఇంట్లో చిన్నారితో ఉండగా పక్కింట్లో ఉంటున్న హర్షియా అనే అమ్మాయి వచ్చింది. చిన్నారిని తీసుకెళ్లింది. అయితే కొంత సేపటికే వచ్చి గంజి తనపైకి పోసుకుందని చెప్పింది. దీంతో ఆ చిన్నారిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం చిన్నారిని ఆదివారం కర్నూలుకు తీసుకెళ్లారు.

వైసీపీ కార్యకర్తను విచారించిన పోలీసులు

గార్లదిన్నె, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కనుంపల్లికి చెందిన ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా సిబ్బందితో ఆదివారం గ్రామానికి వెళ్లి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రసాద్‌ను అరెస్టు చేయలేదని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విచారించి, సాయంత్రం వదిలిపెట్టామని శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

మహేశ్వర్ రెడ్డి మృతిపై అనుమానాలు

● సమగ్ర దర్యాప్తు జరపాలి ● పరిటాల శ్రీరామ్ డిమాండ్


మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన ఉమామహేశ్‌రెడ్డి మృతిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని, దీనిపై సమగ్ర ద ర్యా ప్తు జరపాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. సోములదొడ్డి సమీపంలో రైలు పట్టాల వద్ద పడిఉన్న ఉమా మహేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిటాల శ్రీరామ్ ఆస్పత్రికి వెళ్లి ఉమామహేశ్వర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అక్కడే ఉన్న కుటుంబసభ్యుల ఓదార్చి, అండగా తామున్నామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ... తోపుదుర్తి మహేశ్‌రెడ్డి 2019 తరువాత తనను కలిశారని, అప్పటినుంచి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు ఉమామహేశ్వర్ రెడ్డిని టార్గెట్ చేస్తూవచ్చా రన్నారు. అనేక ఇబ్బందులుపెట్టారన్నారు. అయినా ఉమామహేశ్వర్ రెడ్డి ధైర్యంగా నిలబడ్డారన్నారు. కొంతకాలంగా ప్రకాశ్‌రెడ్డి సోదరుడు రాజశేఖరరెడ్డి(రాజారెడ్డి) బెదరింపులకు దిగుతున్నారన్నారు. ఇందుకు ఫేస్‌బుక్‌లో ఉన్న పోస్టులే సాక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే ఉమామహేశ్వర్‌రెడ్డి రైలు పట్టాలపై శవమై కనిపించడం పట్ల చాలా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును తప్పుదారి పట్టించడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మృతిపై ఎస్పీని కలుస్తామని, అవసరమైతే రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.

విచారణ చేయాలి : బండి పరశురామ్

అనంతపురం విద్య, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తోపుదుర్తి మహేష్ మృతిపై పోలీసులు విచారణ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు తనను బెదిరిస్తున్నారంటూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టిన మరుసటి రోజే తోపుదుర్తి మహేష్‌రెడ్డి అనుమానాస్పదంగా రైలు పట్టాల వద్ద శవమై కనిపించాడన్నారు.

నగరంలోని 32వ డివిజన్ సమస్యలతో సతమతమవుతోంది. డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్, విద్యుత్‌నగర్, విద్యుత్‌శక్తినగర్, సెవెన్ హిల్స్ కాలనీలు ఉన్నాయి. డివిజన్‌లో అపరిశుభ్రత ప్రధాన సమస్యగా ఉంది. కాలనీల్లో కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి వస్తోంది. పల్లపు ప్రాంతాల్లో ఇళ్ల వద్దే నిల్వ ఉంటోంది. దీంతో దోమల బెడద అధికంగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల ఎప్పుడో వేసిన కాలువలు దెబ్బతిన్నాయి. కాలనీల్లో పందులు, ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చెత్త సేకరణ విషయంలో కార్పొరేషన్ సిబ్బంది విఫలమవుతున్నారు. దీంతో డివిజన్‌లో అక్కడక్కడ చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. - అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి


చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రధాన మురుగు కాలువ

- అధ్వానంగా పారిశుధ్యం
- మురుగు కాలువలు, లైట్లు లేవు
- వారానికోసారి చెత్త సేకరణ వాహనాలు
- ఇబ్బంది పడుతున్న 32వ డివిజన్ ప్రజలు

ఇదేమి ఆదర్శం..!

కాలువలు పూడినా....

డివిజన్ పరిధిలోని విద్యుత్‌శక్తినగర్ వైపు అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల చెత్త కూడా రోజూ ఎత్తడం లేదని సమాచారం. దీంతో కాలనీలోని మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. దాన్ని తొలగించకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి వస్తోంది. కాలువల్లో మురుగుతీసేవారు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సారి కాలువల్లో మురుగు తీస్తే మళ్లీ నెలల తరువాతే కార్పొరేషన్ సిబ్బంది వస్తున్నారు.

వీధిలైట్లు లేవు

డివిజన్ పరిధిలో వీధి లైట్ల సమస్య కూడా తీవ్రంగా ఉంది. విద్యుత్‌నగర్ సర్కిల్‌కు సమీపంలోని కాలనీల్లో నేటికీ లైట్లు వెలగని సందులుండటం గమనార్హం. తాజాగా ఇంజనీరింగ్‌లోని ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది ఆరా తీయగా 32 నుంచి 35వీధిలైట్లు వెలగలేదని తెలిసింది. దీర్ఘకాలంగా ఈ లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో రూ.30లక్షలు ఖర్చు చేసి లైట్లు తెప్పించారు. కానీ వాటిని విద్యుత్ స్తంభాలకు అమర్చడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లకూ దిక్కు లేదాయె...

ఆదర్శనగర్, సెవెన్ హిల్స్ కాలనీల్లో సీసీ రోడ్లకు కూడా దిక్కులేని పరిస్థితి. ప్రధానంగా అరవిందనగర్, సెవెన్ హిల్స్ కాలనీల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు ఇటు వైపు చూస్తున్నారో లేదో అర్థం కాని పరిస్థితి. నగర పరిధిలో ఉన్నా రోడ్లు వేయకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది. స్థల వివాదంతో అరవిందనగర్ నుంచి సెవెన్ హిల్స్‌కాలనీకి అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్డుకు అడ్డంగా మట్టివేశారు. దీంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. అక్కడ మట్టి రోడ్డు కావడంతో రోడ్డు కూడా వేయలేదు.

ఖాళీ స్థలాలు.. కంపల పొదలు

డివిజన్ పరిధిలో అధికంగా ఖాళీ స్థలాలున్నాయి. వాటిలో ముళ్లపొదలు పెరిగిపోయాయి. పాములు, ఇతర విషకీటకాలకు ఆవాసంగా మారాయి. దీంతో సమీపంలో నివాసముంటున్న ప్రజలు భయంతో అల్లాడిపోతున్నారు. వాటిని శుభ్రం చేయించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తు



న్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి వారితోనే శుభ్రం చేయించాల్సిన అధికారులు చూసీచూడనట్లు


నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు

ప్రధాన కాలువలకే దిక్కు లేదు

డివిజన్ పరిధిలో ప్రధానంగా మురుగునీటి సమస్య ఉంది. సమీపంలోని నాయక్‌నగర్‌లోని మురుగునీరు సెవెన్‌హిల్స్ కాలనీలోని కాలువల్లోకి వచ్చేస్తుంది. కానీ ఆ నీరుంతా వెళ్లడానికి కాలువలు సరిగా లేవు. విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి నాయక్‌నగర్‌కు వెళ్లే ఎడమవైపు ప్రధాన రహదారిలో కాలువ ఉందా లేదా అనే పరిస్థితి. ఎప్పుడో ఏళ్ల కిందట వేసిన ఆ కాలువ కనిపించడం లేదు. అక్కడ పూడిక తీసే పరిస్థితి కూడా లేదు. దీంతో ఆ కాలువనీరు హౌసింగ్ బోర్డు రహదారిలో లక్ష్మి ఆసుపత్రి ఎదుట స్తంభించిపోతోంది. రామ్‌నరేష్ ఫంక్షన్ హాల్ నుంచి విద్యుత్‌నగర్ వరకు ఉండాల్సిన ప్రధాన మురుగు కాలువ నిలిపివేశారు. ఈ ప్రాంతంలో రూ.24లక్షలతో నిర్మించాల్సిన సీసీ డ్రెయిన్ వర్క్‌ను రద్దు చేశారు.


రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్రత

వ్యవహరిస్తున్నారు. అపరిశుభ్రతను ఆసరాగా చేసుకుని పందులు సంచరిస్తున్నాయి. వాటి ద్వారా రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పార్కుల్లోనూ సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. కార్పొరేషన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. వాటిని టౌన్‌ప్లానింగ్ అధికారులు సంరక్షించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెత్త సేకరణ ఏదీ..?

ఈ ప్రాంతంలో చెత్త సేకరణ సరిగా జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిచ్చిన వారి ఇళ్లకు సంబంధించి చెత్త తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. రోజూ తిరగాల్సిన చెత్త సేకరణ వాహనాలు కనీసం రావడం లేదు. కొన్ని కాలనీల్లో మూడు రోజులకు, మరికొన్ని కాలనీలకు వారం రోజుల తర్వాతే చెత్త సేకరణ వాహనాలు వస్తున్నట్లు సమాచారం. దీంతో డస్ట్‌బిన్స్ నిండిపోయి ఎక్కడ పడేయాలో దిక్కుతెలియక కాలనీలవాసులు ఆందోళన చెందుతున్నారు.


రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు


టీడీపీ అర్బన్ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, నాయకులు


వెంకటాపురంలో క్యాంప్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


సాయి విజ్ఞాన్ స్కూల్‌లో వేడుకలు

ఘనంగా గణతంత్ర వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

జిల్లా కేంద్రంతో పాటు అనంతపురం రూరల్, రాప్తాడు, శింగనమల, రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల వ్యాప్తంగా ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జెండాను ఎగరవేశారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, గడ్డం సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రామలింగారెడ్డి, దేవళ్ల మురళి, రాయల్ మురళి, కుంచెపు వెంకటేష్, నాయకులు సిమెంట్ పోలన్న, పోతుల లక్ష్మీ నరసింహులు, పరమేశ్వరన్, కడియాల కొండన్న, సరిపూటి రమణ, కురబ నారాయణస్వామి, స్వప్న, సంగా తేజస్విని, సరళ, భవానీ, చరిత, లక్ష్మీ నరసింహులు, నెట్టెం బాలకృష్ణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రామగిరి మండలపరిధిలోని తన స్వగ్రామమైన వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేసుకున్నారు.


మారుతీనగర్ కేశవరెడ్డి స్కూలులో...


గణతంత్ర వేడుకల్లో మొదటి బహుమతి పొందిన బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థినులు

అట్టహాసంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): లహరీ డ్యాన్స్ ఫిట్నెస్ అకాడమీ సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో అట్టహాసంగా నిర్వహించారు. సినీ హీరో సంపూర్ణేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతపురం వాసుల అభిమానం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, ఇక్కడివారికి ప్రేమాభిమానాలు ఎక్కువన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ డ్యాన్సుల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని, ఇందుకు లహరి డ్యాన్స్ ఫిట్నెస్ అకాడమీ వేదికగా నిలవడం అభినందనీయమన్నారు. పలువురు కళాకారులను ఆయన చేతులమీదుగా సత్కరించారు. అనంతరం పలువురు నృత్యకారులు డ్యాన్సులతో అలరించారు. అకాడమీ వ్యవస్థాపకుడు హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, మాజీ మేయర్ రాగే పరశురాం దంపతులు, శ్రీనిధి రఘు, లంకాప్రసాద్, రమేష్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాట్యాచార్యులు, డ్యాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్నవారు

ఆర్‌జేడీ దృష్టికి 'బంగారు బుల్లోడు' అక్రమాలు

అనంతపురం విద్య, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాశాఖాధికారి 'బంగారు బుల్లోడు'పై ఇటీవల పలువురు ఆర్‌జేడీకి ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 24న జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో జిల్లాకు వచ్చిన కడప ఆర్‌జేడీ శామ్యూల్‌కు జేఎన్టీయూ వద్ద విద్యార్థి సంఘాల నేతలు పలువురు బంగారు బుల్లోడుపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆర్‌జేడీ సైతం స్పందిస్తూ ఫిర్యాదులు వచ్చాయని, విచారణ చేస్తున్నామని, చెప్పినట్లు సమాచారం.

బొలెరో వాహనం బోల్తా

కనగానపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం జంక్షన్ వద్ద ఆదివారం బొలేరోరా వాహనం, ఇసుక ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం చెల్లాచెదురయ్యాయి. సమాచారం అందుకున్న కనగానపల్లి పోలీసులు రోడ్డుపై పడి ఉన్న వాహనంతోపాటు బియ్యం ప్యాకెట్లు పక్కకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నార్పల, జనవ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ సచివాలయం వద్ద గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకటనరసానాయుడు పారిశుధ్య కార్మికులకు దస్తులు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ సెక్రెటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య, మందకృష్ణకు అభినందనలు


బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్/ విద్య/ నార్పల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ పురస్కారం దక్కించుకున్న సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారాలు దక్కిన సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర అధికా ప్రతినిధి బంగినాగ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారి ఫెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడంపై ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆసంఘం జాతీయ అనదపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయభవన్‌లో కేక్ కట్ చేశారు.

గడ్డివామి దగ్ధం

గుత్తిరూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో బండి లక్ష్మీనారాయణ అనే రైతుకు చెందిన గడ్డివామి ఆదివారం అగ్నికి ఆహుతైంది. లక్ష్మీనారాయణ పశువుల మేత కోసం తన మూడు ఎకరాల్లోని వేరుశనగ పొట్టును పొలంలోనే వామి వేసి ఉంచాడు. కాగా ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు బీడీ తాగి పడి వేయడంతో గడ్డి వామి పక్కన ఉన్న చెత్తకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న గడ్డివామికి సోకడంతో దగ్ధమైంది. సమాచారం అందుకున్న లక్ష్మీనారాయణ వచ్చేసరికి వామి మొత్తం కాలిపోయింది. రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడుజ ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి సమయంలో చిన్న నారాయణ అనే రైతుకు చెందిన గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో వామి దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల చర్యల వల్ల రూ.10వేల మేర ఆర్థికంగా నష్టపోయినట్లు రైతు వాపోయాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి సమీపంలో పేకాటకేంద్రంపై ఆదివారం దాడులు చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంలో దాడులు చేశామన్నారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారివద్ద నుంచి రూ.15500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పశుపతినాథుని ఆలయంలో చోరీ

రాయదుర్గంరూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామ సమీపంలో లింగాలబండపై వెలసిన పశుపతినాథుని ఆలయంలో చోరీ జరిగినట్లు పూజారి ఆదివారం తెలిపారు. ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించి తొమ్మిది రాగిచెంబులు, ఒక ధారపాత్రతో పాటు పూజా సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఎస్ఐ బాలరాజు సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులో గల 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ సేగాదేవన్, క్లీనర్ సంతోష్ కుమార్ లారీలో తెలంగాణకు నుంచి బెంగుళూరుకు వెళ్తుండగా కొత్తపేట గ్రామశివారులో వెళ్లే లారీని ప్రమాదవశాత్తూ ఢీ కొట్టారు. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

పెద్దవడుగూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో విజయమ్మ (35) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన విజయమ్మ శనివారం తన భర్తతో కలిసి పొలంలో కందిపంటను కోయడానికి వెళ్లింది. కొద్దిసేపటి అనంతరం ఆమె బహిర్భూమికి వెళ్లొస్తానని భర్తతో చెప్పి వెళ్లింది. తర్వాత ఎంతసేటికీ రాకపోవడంతో భర్త చుట్టుపక్కల గాలించాడు. ఒక చోట అచేతనంగా పడి ఉండడం చూసి వెళ్లి పరిశీలించాడు. పురుగుల మందు తాగి మృతిచెందినట్లు గుర్తించాడు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ నాయకుల సంబరాలు

గుత్తి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంతో గుత్తిఆర్ఎస్‌లో టీడీపీ నాయకులు, అభిమానులు ఆదివారం సాయంత్రం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా 8వ వార్డులో కేక్ కట్ చేసి జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మస్తాన్‌బీ, డాక్టర్ సెల్ రాష్ట్ర నాయకుడు జావీద్, న్యాయవాది సోమశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

దశాబ్దం తర్వాత డ్రైనేజీ పనులు


కోట కాలనీలో పర్యటిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

కళ్యాణదుర్గం జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కోట వీధిలో దశాబ్ధ కాలం తర్వాత డ్రైనేజీ పనులు ప్రారంభయ్యాయి. ఆదివారం స్థానిక పట్టాభిరామస్వామి ఆలయ చైర్మన్ దేవినేని అవినాష్ పనులను పరిశీలించారు. త్వరలో జరిగే పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలకు కోట వీధిలో ఉన్న డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కావాలని ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని పనులను వేగంగా చేయిస్తున్నారు. ఇన్నాళ్ల పాటు ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతుండే వారమని, ఇప్పుడు డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారని ఆ కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థి అదృశ్యం


రంజిత్

కూడేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన విద్యార్థి రంజిత్ అదృశ్యమయ్యాడు. సత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలోని ప్రభుత్వ ఎస్టీ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లి నాగేంద్రమ్మ శనివారం పాఠశాలకు అనంతపురం పట్టణం నుంచి నల్లమాడకు వెళ్లే బస్సులో అతన్ని పంపించింది. బత్తలపల్లికి వెళ్లానని ఫోన్‌లో చెప్పినట్లు ఆమె తెలిపారు. తర్వాత రంజిత్ నుంచి ఫోన్ రాకపోవడంతో ఆమె పాఠశాలకు వెళ్లి విచారించింది. అతను పాఠశాలకు రాలేదని సిబ్బంది చెప్పడంతో.. ఆమె వివిధ ప్రదేశాల్లో రంజిత్ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 7799141873, 91606 74959 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హౌసింగ్ కార్యాలయంపై ఎగరని జెండా


గణతంత్ర వేడుకలకు నోచుకోని హౌసింగ్ కార్యాలయం

విడపనకల్లు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపై ఆదివారం జాతీయ జెండాను ఎగరవేశారు. కానీ మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంపై మాత్రం ఎగరవేయలేదు. దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు నిర్వహిస్తుంటే ఇక్కడి హౌసింగ్ అధికారులకు మాత్రం జాతీయజెండా ఎగరవేసే తీరిక లేకుండాపోయింది. కనీసం కార్యాలయాన్ని కూడా తెరవ కుండా తాళం వేశారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

● వాడవాడలా రెపరెపలాడిన జాతీయ పతాకం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల కేంద్రాలతోపాటు వాటి వ్యాప్తంగా ఉన్న మండలకేంద్రాలు , గ్రామాల్లో సైతం వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలతోపాటు పార్టీలు, ప్రజాసంఘాల కార్యాలయాలు, వైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, స్వచ్ఛంద సంస్థలు తదితర చోట్ల జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్ తదితర మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని గణతంత్ర వేడుకలను జరుపుకుంటున్నట్లు వివరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు భారతమాత, దేశ నాయకులు, సైనికుల వేషధారణలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. వివిధ ప్రాంతాల్లో భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ప్రజా,కార్మిక సంఘాల నాయకులు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డులో గల టీడీపీ కార్యాలయం వద్ద మువ్వన్నెల జెండాను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అలాగే స్థానిక రైల్వే గ్రౌండ్‌లో రైల్వే డీఆర్ఎం సీఎస్ గుప్తా జాతీయ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర దినోత్సవానికి జీఎం పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఇక జీఆర్పీ రైల్వే జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా జెండాను ఎగురవేసి సైనిక వందనాన్ని స్వీకరించారు. ఇక పట్టణ పురవీధుల్లో మాజీ సైనిక ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ శివరామకృష్ణ జెండాను ఆవిష్కరించారు.


కళ్యాణదుర్గంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్లో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ఇండియా ఆకృతిలో విద్యార్థులు


గుంతకల్లు టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయరాం


తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో వేడుకలో పాల్గొన్న చైర్మన్ జేసీపీఆర్



గుంతకల్లులో జెండాను ఆవిష్కరిస్తున్న జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా , వందనం చేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా


శెట్టూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి


రాయదుర్గం కోర్టు వద్ద జెండా ఎగురవేస్తున్న సివిల్ కోర్టు న్యాయాధికారి రమ్య


ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న అధికారులు, సిబ్బంది


కళ్యాణదుర్గంలోని ప్రజావేదిక వద్ద గణతంత్ర వేడుకల్లో టీడీపీ నాయకులు



కణేకల్లులో 76వ రిపబ్లిక్‌డే ఆకృతిలో శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు


కంబదూరులోని శారదా విద్యావిహార్ స్కూల్లో వేషధారణలలో చిన్నారులు


యాడికిలో 225 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న ప్యారడైజ్ పాఠశాల విద్యార్థులు


గుంతకల్లు విజ్ఞాన్ పాఠశాలలో వేడుకలో పాల్గొన్న సీఐ మనోహర్, విద్యార్థులు


తాడిపత్రిలో వివిధ వేషధారణలలో పద్మవాణి పాఠశాల విద్యార్థులు

రక్షిత మంచినీటి సరఫరాకు ప్రతిపాదనలు రూపొందించాలి

● అధికారులకు ప్రభుత్వ విప్ కాలవ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా కోసం సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గ్రామీణ నీటి పారుదల అధికారులను ఆదేశించారు. పల్లెల్లో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వడానికి రూపొందించిన ప్రాథమిక ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో ఆదివారం సాయంత్రం ఆయన పట్టణంలోని తన నివాసంలో సమీక్ష జరిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా రక్షితనీరు అందించడానికి సుమారు రూ. 291 కోట్లతో తాజాగా ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు కాలవకు వివరించారు. పీఏబీఆర్ నుంచి శ్రీరామిరెడ్డి పథకం ద్వారా ప్రస్తుతం నీటిని అందిస్తున్న పైప్‌లైన్ మార్చి దాని సామర్థ్యం పెంచాల్సిన అవసరాన్ని అధికారులు ప్రతిపాదనల్లో చేర్చామన్నారు. 12 ఏళ్ల కింద ఏర్పాటు చేసిన సదరు పైపులైనుకు తరచూ మరమ్మతులు వస్తున్న కారణంగా దానిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దాంతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పంపిణీ పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.155 కోట్లు అవసరం ఉంటుందన్నారు. అలాగే సుమారు 80 నీటి ట్యాంకుల నిర్మాణానికి, పైప్ లైన్ల ఏర్పాటుకు రూ.56.89 కోట్లు అవసరం అవుతుందన్నారు. మొత్తం మీద రూ.291 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా రక్షిత మంచినీటిని అందించవచ్చని అధికారులు కాలవకు వివరించారు. సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీ కోసం ఇటీవల నేమకల్లు గ్రామాన్ని సందర్శించిన సమయంలో రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ ప్రజలకు రక్షిత మంచినీటిని ప్రాధాన్యత క్రమంలో అందిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారులు రూపొందించిన రూ. 291 కోట్ల వ్యయం కాగల ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటికి పాలన పరమైన ఆమోదం లభించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ జలజీవన్‌మిషన్ ద్వారా అందించే నిధుల అనుసంధానంతో సాధ్యమైనంత త్వరగా ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు.

మహావిష్ణువు, లక్ష్మీదేవికి పూజలు


ప్రత్యేకఅలంకరణలో స్వామి, అమ్మవారు

గుంతకల్లు టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం మహావిష్ణువు, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం మహావిష్ణువు, లక్ష్మీదేవి విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. తర్వాత పుష్పార్చన, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, సెక్రెటరీ కందూరు కృపాకర్, కోశాధికారి మేడా వెంకటేశ్వర్లు, పూజా కమిటీ చైర్మన్ పరచూరి సత్త రంగయ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎస్కేఆర్సీ క్లబ్ కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరిబసవ రిక్రియేషన్ క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా ఎర్రిస్వామి నాయుడు, సహాయ కార్యదర్శిగా రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, విజయ్‌భాస్కర్, సీ. నాగరాజు, మారెన్న, నాగభూషణంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎస్కేఆర్సీ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

దర్గా ఉత్సవాలను విజయవంతం చేయండి

● మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ పిలుపు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అశోక్‌పిల్లర్ వద్ద సిద్ది బాషా దర్గా ఉత్సవాలు త్వరలో జరగనున్నాయని, విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక దర్గా సమీపంలో ఆదివారం ఆయన ముస్లిం మత పెద్దలు, దర్గా, మసీదుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దర్గాలు, మసీదుల నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రజలకు వివరించాలని, వీటి పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దర్గాలు, మసీదులతోపాటు చర్చిలు, హిందూ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు నియాజ్, అయూబ్, గోరా, టాటా హాజీ, గఫూర్, దర్గా పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత విభావరి

పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఉన్న శ్రీవాణి హైస్కూల్‌లో ఆ విద్యాసంస్థల చైర్మన్ గంగాధర్ ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై గాయకుడు చంద్రతేజతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి సంగీత కార్యక్రమాలు అప్పుడప్పుడు చేపడుతూ ఉండాలని చెప్పారు. అనంతరం గాయకుడు చంద్రతేజ పలు పాటలు పాడి అలరించారు. పాఠశాల సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయంలో సర్పంచ్ భర్త పెత్తనం

● గణతంత్ర వేడుకలలో జాతీయ జెండా ఆవిష్కరణ


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ భర్త గంగాధర

బ్రహ్మసముద్రం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కోటిపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో సర్పంచ్ మమత బదులు ఆమె భర్త, వైసీపీ నాయకుడు గంగాధర పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు కానీ, సచివాలయ అధికారులు కానీ జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉంది. కానీ రాజ్యాంగానికి విరుద్ధంగా సర్పంచ్ భర్త సచివాలయంలో జెండా ఆవిష్కరించడంతో గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. అధికారులకు కూడా రాజ్యాంగ విలువలు తెయదంటే విచిత్రంగా ఉందంటూ పెదవి విరిచారు. సచివాలయంలో సర్పంచ్ భర్త పెత్తనం ఏంటంటూ మండిపడ్డారు.

సాగు నీరందించి రైతులను ఆదుకోవాలి: సీపీఎం

గుంతకల్లుటౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల్లో పూడిక తీసి హంద్రీనీవా నీటిని నింపి రైతులకు సాగు నీరందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ శాఖా కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువుల్లో పూడికతీత పనులు, కంపచెట్లను తొలగించే పనులు చేపట్టాలని కోరారు. అనంతరం హంద్రీనీవా నీటిని నింపి రైతులకు సాగునీటిని అందించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సభ్యులు కసాపురం రమేష్, జగ్గలిరమేష్, రంగమ్మ, సురేంద్ర, రామునాయక్, ఓబులేసు, జగదీష్, సుంకన్న పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

● నలుగురు చిన్నారులకు స్వల్ప గాయాలు


బోల్తాపడిన స్కూల్ బస్సు

గుమ్మఘట్ట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఆదివారం ఉదయం గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం విద్యార్థులను పాఠశాలకు తీసుకెళుతూ రాయదుర్గం పట్టణానికి చెందిన ఏవీఆర్ ప్రైవేట్ స్కూల్ బస్సు గోనబావి క్రాస్ వద్ద బోల్తా పడింది. దీంతో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న మంజులకు చేయి ఫ్రాక్చర్ కాగా రిషిత్, నిఖిత గగన్‌దీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ వేగంగా వెళుతూ గోనబావి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి సమీప పొలాల్లోకి వెళ్లడంతో బస్సు బోల్తాపడింది. బస్సులో ఆ నలుగురు విద్యార్థులే ఉన్నారు. మిగతా గ్రామాల విద్యార్థులను ఎక్కించుకునేందుకు వెళుతున్న తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రైవేట్‌స్కూళ్ల యాజమాన్యాలు కాలం చెల్లిన, కండిషన్ లేని బస్సులను నడుపుతున్నారని, వాటిని తనిఖీ చేయాల్సిన మోటార్‌వెహికల్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగుతున్నారని విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే పాఠశాలను సీజ్ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన చిన్నారులను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.